క్లుప్తంగా

ప్రజా సేవకే ఈ జీవితం


డాక్టర్ సునీల్‌కుమార్

చిత్తూరు రూరల్/ పూతలపట్టు: 'ప్రజా సేవకే నా జీవితం అంకితం. నన్ను ఆదరించి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయలేదు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా' అని పూతలపట్టు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. పూతలపట్టు అభ్యర్థిగా శుక్రవారం ఉదయం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని వర్గం లేదని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేశానని, ఆపదొస్తే ఆదుకుంటానని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో సర్కారు బడులు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిందని చెప్పారు. వైద్య సేవలు ఇంటికొస్తున్నాయని చెప్పారు. డాక్టర్ ఇంటికొచ్చి ప్రజల బాగోగులను పరీక్షిస్తున్నారని వివరించారు. దేశంలో ఒక్క జగనన్న ప్రభుత్వం మాత్రమే ఒకటో తేదీనే తలుపుతట్టి అవ్వా తాతలకు పింఛన్ ఇస్తోందన్నారు. మళ్లీ పేదలకు మేలు చేయాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎంను ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గంలో 53 సమస్యాత్మక కేంద్రాలు


మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: నియోజకవర్గంలో 260 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 53 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, వెబ్ కెమెరాలు అమర్చినట్లు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు తొలిరోజు గురువారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 26వ తేదీ ఉపసంహరణ, మే 13వ తేదీ పోలింగ్ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజలు శాంతియుతంగా ఎన్నికలు జరగడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: పట్టణంలోని కోర్టులో మే 11న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కోర్టులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి కేసులైనా రాజీ చేసుకునే వెసులుబాటు ఉందని, కక్షిదారులు పంతాలు, పట్టింపులను పక్కనపెట్టి కేసులను రాజీ చేసుకుని మనశ్శాంతితో జీవించాలన్నారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు.

ట్యాంకర్లపై జీపీఎస్ నిఘా

చిత్తూరు: నగరపాలక సంస్థ పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకత కోసం నగర కమిషనర్ అరుణ చేపట్టారు. నగరవాసులకు నీళ్లను అందిస్తున్న కార్పొరేషన్ నీటి ట్యాంకర్లు, అద్దె ట్యాంకర్లు వాటికి నిర్దేశించిన మార్గాల్లో కచ్చితంగా నీటి సరఫరా చేశాయా? లేవా అని పర్యవేక్షించడం కోసం జీపీఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) నిఘా ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో చివరన అందరికీ నీటిని సరఫరా చేయడం, నీటి సరఫరా ట్యాంకరును ప్రతి నిమిషం పర్యవేక్షించడం ద్వారా అందరికీ నీరు అందించడమే లక్ష్యంగా ట్రాకింగ్ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. అద్దె ట్యాంకర్లు, కార్పొరేషన్ ట్యాంకర్లకు జీపీఎస్ ట్రాకర్లను బిగించారు. కార్పొరేషన్ వాహనాల షెడ్డులో గురువారం ట్యాంకర్లకు జీపీఎస్ ట్రాకర్ల బిగింపు ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను పక్కాగా పర్యవేక్షించాలని ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఇదే తరహాలో నగరపాలక పరిధిలో చెత్త తరలించే వాహనాలకు త్వరలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీరు గోమతి, డీఈ వెంకట ప్రసాద్, ఏఈ లోకేష్ ఉన్నారు.


ట్యాంకర్లను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

విజయీభవ..!

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి నామినేషన్
- స్వచ్ఛందంగా తరలివచ్చిన మహిళలు, పార్టీ కార్యకర్తలు
- డిప్యూటీ సీఎం, ఎంపీ, చంద్రగిరి అభ్యర్థుల హాజరు


భారీ ర్యాలీగా తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విజయానందరెడ్డి, రెడ్డెప్ప

చిత్తూరు అర్బన్/కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా విజయానందరెడ్డి గురువారం నామినేషన్ అట్టహాసంగా దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో చిత్తూరు నగరంలోని రోడ్లు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ నామినేషన్ పర్వానికి పార్టీ కార్యకర్తల నుంచి నియోజకవర్గంలోని ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. విజయానందరెడ్డితో పాటు ఆయన సతీమణి ఇందుమతి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ రెడ్డెప్ప, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. గంగినేనిచెరువు వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయానికి బయలుదేరారు. గంగినేనిచెరువు నుంచి విజయా పాల డెయిరీ వరకు జరిగిన ర్యాలీలో విజయానందరెడ్డికి అడుగడుగునా స్వాగతం లభించింది. చిత్తూరు నగరంలోని 50 డివిజన్లతో పాటు చిత్తూరు మండలం, గుడిపాల నుంచి కూడా మహిళలు, పార్టీ కార్యకర్తలు విజయానందరెడ్డికి మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. చౌడేశ్వరి అమ్మవారి గుడి, గిరింపేట కూడలి, దుర్గమ్మ ఆలయం, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల రోడ్డు మీదుగా విజయా డెయిరీ వరకు భారీ ర్యాలీ సాగింది. ఓపెన్‌టాప్ వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ విజయానందరెడ్డి ముందుకుసాగారు. ర్యాలీ ప్రారంభం అయినప్పటి నుంచి కలెక్టరేట్ వరకు పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. దారిపొడవునా కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జెండాలు పట్టుకుని జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ నడిచారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, చిత్తూరు రూరల్, గుడిపాల పార్టీ మండలాధ్యక్షులు త్యాగ, జనార్దన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం చిత్తూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులుకు మూడుసెట్ల నామినేషన్ పత్రాలను విజయానందరెడ్డి అందించారు.


ర్యాలీలో ఆకట్టుకున్న జగన్, విజయానందరెడ్డి ఫొటోల ప్రదర్శన, పూలజల్లుతో విజయానందరెడ్డికి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు, ర్యాలీలో మహిళా కార్యకర్తల జోష్, నామినేషన్ ర్యాలీలో బారులు తీరిన ప్రచార వాహనాలు

చెక్ పోస్టుల్లో నిఘా పెంచండి


చెక్‌పోస్ట్‌లో తనిఖీచేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు శంకర్‌ప్రసాద్‌శర్మ

గుడిపాల: రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్ట్‌ల్లో నిఘా పెంచాలని పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు శంకర్‌ప్రసాద్‌శర్మ అన్నారు. మండల సరిహద్దులో ఉన్న గొల్లమడుగు, ముత్తరాశికుప్పం చెక్‌పోస్ట్‌లో గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఇప్పటివరకు ఎంత నగదు సీజ్ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు రూ.9 లక్షలు సీజ్ చేసినట్లు తెలియజేశారు. ఆయనతోపాటు తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు పాల్గొన్నాయి.

వేసవిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తవణంపల్లె: వేసవి దృష్ట్యా ప్రజలు ఆరుబయట తిరగకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లె, నల్లపురెడ్డిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 87 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు ఐరన్‌మాత్రలు వాడాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. గర్భిణులు ప్రసవం సమయంలో 104, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మండుతున్న ఎండల్లో తిరగరాదని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నేత్రి, రోజా, ఎంఎల్‌హెచ్‌పీలు మానస, మౌనిక, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

21 నుంచి మహాభారతం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ గ్రామంలోని శ్రీ కృష్ణ సహిత శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల దేవాలయంలో ఈనెల 21వ తేది నుంచి మహాభారత యజ్ఞం ప్రారంభమవుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పర్వం మే 8వరకు కొనసాగుతుందన్నారు. హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు.

సరితకు డాక్టరేట్



చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రానికి చెందిన సరితకు తిరుపతి జిల్లా ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ఆ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరులోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ శివప్రసాద్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. సినర్జిటిక్ ఎఫెక్ట్ ఆఫ్ హనీ అండ్ లెమన్ జ్యూస్ ఆన్ ది సిల్క్‌వార్మ్, బాంబిక్స్ మోరి విత్ రెఫరెన్స్ టూ గ్రోత్ మెటబాలిజం అండ్ సెరికల్చరల్ ప్రొడక్టివిటీ అనే అంశంపై సరిత పరిశోధన నిర్వహించి యూనివర్సిటీ సమర్పించింది. డాక్టరేట్ పొందిన ఆమెను సావిత్రమ్మ డిగ్రీ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

అట్టహాసంగా 2కే24 సెలెస్టా ప్రారంభం


మాట్లాడుతున్న నటుడు ఆనంద్ దేవరకొండ

చిత్తూరు కలెక్టరేట్ : యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రావూరి వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 2కె24 సెలెస్టా కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. వైస్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రతి ఏటా సెలెస్టా నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇది ఎంతో ఉపయోగకరమని చెప్పారు. కేరళా డ్రమ్స్, అగిగోస్ ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. సినీ హీరో ఆనంద్ దేవరకొండ తన మాటలతో, డాన్స్‌తో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ లోకనాథరెడ్డి, సెలెస్టా కన్వీనర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్యసేవలు

గుడిపాల: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటివద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. గుడి పాల మండలం పేయనపల్లెలో గురువారం డాక్టర్ అనూష 66 మందికి వైద్యసేవలందించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

శ్రీరామనవమి ఉత్సవం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఉత్సవం వేడుకగా సాగుతోంది. ఉదయం స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆభరణాలు తొడిగి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి చంద్ర ప్రభవాహనంలో ఊరేగించారు.

నాడు అధ్వానం.. నేడు ఆహ్లాదం


నాడు -197రామాపురం నుంచి తిరుత్తణి వెళ్లే రోడ్డు


నాడు - సీఎం కండ్రిగ నుంచి తమిళనాడును కలిపే రోడ్డు

గుడిపాల: కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు నరకం చూపిస్తున్న రహదారులు బాగుపడుతున్నాయి. పాఠశాలల తరహాలోనే నాడు–నేడు పథకం కింద రహదారుల తీరుతెన్నులను మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. తెలుగుదేశం ప్రభుత్వంలో ఏనాడు రోడ్లను బాగుచేసిన పరిస్థితి దాఖలాలు లేవు.దీంతో రోడ్లన్నీ అధ్వాన్న పరిస్థితికి చేరాయి.ప్రస్తుతం ప్రభుత్వం రోడ్ల రూపురేఖలను మార్చాయి. 197రామాపురం నుంచి తిరుత్తణి రోడ్డు వరకు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. దీన్ని ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో స్పందించి 10కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటుచేసింది. ఈ రోడ్డువల్ల 47 గ్రామాలకు రాకపోకలకు సౌకర్యంగా మారింది. 197రామాపురం రోడ్డు నుంచి సీఎం కండ్రిగ మీదుగా తమిళనాడుకు వెళ్లే రోడ్డు కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. ఈ మార్గం వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఉపయోగపడుతోంది.


నేడు -197 రామాపురం నుంచి తిరుత్తణి వెళ్లే రోడ్డు


నేడు - సీఎం కండ్రిగ నుంచి తమిళనాడును కలిపే నూతన రోడ్డు

కాలేయం నిశ్శబ్ద అవయవం

- నేడు వరల్డ్ లివర్ డే



డాక్టర్ శిరీష

బంగారుపాళెం: మానవుని శరీరంలోపల నిశ్శబ్దంగా పనిచేసే పెద్ద అవయం 'కాలేయం' అని బంగారుపాళెం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 19న 'ప్రపంచ కాలేయ దినం'గా పాటించనున్న నేపథ్యంలో ఆమె అవగాహన కల్పించారు. కాలేయం గురించి అవగాహన పెంపొందించడం, కాలేయ వ్యాధులను గురించి తెలియజేయడం, ఆ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం ప్రపంచ కాలేయ దినం యొక్క ముఖ్య ఉద్దేశం. శరీరం బయట కనబడే భాగాలలో అతి పెద్ద అవయవం చర్మం కాగా, శరీరం లోపల అతి పెద్ద అవయవం 'కాలేయం' ఇది సుమారు 1.6 కిలోల బరువు ఉంటుంది. ముదురు గోధుమ వర్ణంలో గుండెకు సమీపంలో ఉంటుంది. కాలేయం దాదాపు 500 రకాల పనులను నిర్వహించే ఒక నిశ్శబ్ద అవయవం. ఇది స్రవించే పైత్య రసం క్రొవ్వుల జీర్ణక్రియలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దేహంలోకి చేరిన విష పదార్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుంది. శరీరంలో ఏర్పడిన బైలిరూబిన్(వయసు మళ్లిన ఎర్రరక్త కణాలు విచ్ఛిన్నం కావడం వల్ల ఏర్పడిన పదార్థం), కొలెస్ట్రాల్, యూరియా వంటి వ్యర్థ పదార్థాలను విసర్జిస్తుంది. శరీరంలో ప్రొటీనులు, కార్బోహైడ్రేటులు, ఫ్యాట్స్ తదితర జీవ క్రియల్లో పాల్గొంటుంది. ఆహార పదార్థాలను నిలువ చేసి అవసరం అయినప్పుడు రక్తంలోనికి పంపుతుంది. దేహానికి గాయమైనప్పుడు రక్తస్రావం జరగకుండా నివారిస్తుంది. కాలేయంలో చాలా భాగాన్ని తొలగించినప్పటికీ, కోల్పోయిన భాగాన్ని పునరుత్పత్తి చేసుకోగలదు. బాగా తాగుడుకు అలవాటు పడిన వారిలో శరీరంలోకి చేరిన ఆల్కహాల్‌ను కాలేయం నీరు మరియు కార్బన్ డై ఆక్సైడ్‌గా విడగొడుతుంది. ఈ ప్రక్రియ వల్ల ఏర్పడే కొన్ని రసాయనాలు కాలేయ కణాలను దెబ్బతీస్తాయి. ఇలా దెబ్బతిన్న కణాలు మళ్లీ అభివృద్ధి చెందవు. ఇలాంటి స్థితిని 'లివర్ సిర్రోసిస్' అంటారు. దీర్ఘకాలంగా మందులను ఉపయోగించడం కూడా లివర్ సిర్రోసిస్‌కు దారి తీయవచ్చు. మద్యం తాగడం వల్ల కాలేయం గ్లూకోజ్, ఫాట్స్ వంటి వాటిని నిలువచేసే పనికి ఆటంకం కలుగుతుంది. ఫలితంగా ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ కలుగుతుంది. తాగుడు మానేసినట్‌లైతే క్రమంగా ఈ వ్యాధి తగ్గిపోతుంది. కలుషితమైన ఆహారాన్ని, నీటిని తీసుకోవడం వల్ల, కలుషిత రక్తాన్ని ఎక్కించుకోవడం వల్ల, కొన్ని రకాల వైరస్‌ల వల్ల 'హెపటైటిస్' వ్యాధి వస్తుంది. దీని వల్ల కాలేయం వాపునకు గురిఅవుతుంది. ఇది క్రమంగా కామెర్లవ్యాధికి దారి తీయవచ్చు. భారత ప్రభుత్వం వైరల్ హెపటైటిస్ నిర్మూలన కోసం 'జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమాన్ని 2018 జూలై 28న ప్రారంభించింది. వాక్సిన్‌ల ద్వారా వైరల్ హెపటైటిస్‌ను 2030 నాటికి పూర్తిగా నిర్మూలించాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం. కాలేయానికి వచ్చే వ్యాధుల్లో కాలేయ కేన్సర్ కూడా ఒకటి. కాలేయ వ్యాధులు ఉన్న వాళ్లకు జ్వరం, కామెర్లు, కడుపునొప్పి, తరచూ వాంతులు కావడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ధూమ,మద్యపానం మానివేయడం, అతిగా మందులను వాడకపోవడం, బరువు నియంత్రణలో ఉంచుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవడం, కొవ్వు పదార్థాల వాడకాన్ని తగ్గించడం, వ్యాయామం చేయడం వంటి చర్యల ద్వారా కాలేయ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.